‘సూర్యఘర్’తో ఇంట్లో వెలుగులు

- సోలార్ ప్యానల్స్ ద్వారా ఇంట్లోనే విద్యుత్ ఉత్పత్తి
- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలు
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకునే అవకాశం


ఒక భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

పీఎం సూర్యఘర్ పథకం వివరాలు..

వినియోగం (యూనిట్లలో)	సోలార్ కెపాసిటి (కిలో వాట్‌లలో)	సబ్సిడీ
0–150	1–2	రూ. 30 నుంచి రూ. 60 వేలు
150–300	2–3	రూ. 50 నుంచి రూ. 78 వేలు
300 లోపు	3	రూ. 78 వేలు

ద్వారకాతిరుమల: రోజురోజుకు మనపై విద్యుత్ బిల్లుల భారం పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. ప్రతి నెలా విద్యుత్ బిల్లును చూసి వామ్మో.. ఇంత బిల్లు వచ్చిందా.. అని నోరువెళ్లబెట్టని వారు ఉండరు. అయితే సహజ వనరులను వినియోగించుకుని గుదిబండలాంటి విద్యుత్ బిల్లుల భారాన్ని దింపుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం మనకు కల్పిస్తోంది. మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. అందుకు అవసరమైన మేరకు రాయితీ అందిస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది.

విద్యుత్ వాడకం మేరకు..

విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంటుంది.

30 రోజుల్లోనే సబ్సిడీ..

నెట్ మీటరు అమర్చిన తరువాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడు చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ (ఒక మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు) అమర్చనున్నారు. కిలో వాట్ సోలార్ రూటాప్ ప్యానల్ నెలకు దాదాపు 125 పై యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూటాప్ ప్యానల్స్‌ను సూర్యుడి వేడి పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి 6 నుంచి 7 ఏళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోవాల్సింది ఇలా..

ఈ పథకంలో చేరాలంటే ముందుగా సూర్య ఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంటు బిల్లుల కాపీలను జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తోంది. 6–7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– నరసింహస్వామి, విద్యుత్ శాఖ ఏఈ, ద్వారకాతిరుమల

నేడు పింఛన్ల పంపిణీ

కొయ్యలగూడెం: అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసే పింఛన్ల పంపిణీని గురువారం ఉదయం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో అశోక్‌కుమార్ పేర్కొన్నారు. 10354 మందికి రూ.4.44,38,000 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కామవరపుకోట: అడమిల్లిలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో చరిత్ర, కామర్స్ సబ్జెక్టుల నందు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టుల నందు పీజీ 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉన్న, అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, తరువాత మౌఖిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు కళాశాల సూపరింటెండెంట్ చంద్రమోహన్ సెల్ నెంబర్ 99899 29534కు గాని లేదా తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జి.శ్రీనివాసరావు సెల్ నెంబర్ 85002 84838కు సంప్రదించగలరని ప్రిన్సిపాల్ విజయబాబు కోరారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కామవరపుకోట: కేరళ తరహాలో వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆ సంఘ జిల్లా సమావేశాల్లో భాగంగా బుధవారం కామవరపుకోటలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.మహంకాళిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. కోటి నలభై లక్షల మంది ఉన్న వ్యవసాయ కార్మికుల కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ఒక్క మాట కూడా నిర్ణయం చేయలేదని విమర్శించారు. వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించి, విధి విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చేందుకు కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తెచ్చి వారి బతుకులనే మార్పు చేయాలని, పేదలకు ప్రభుత్వ పథకాలు, కనీస వేతనం ఇచ్చే విధంగా రూపొందించి అమలు చేయాల్సిన ప్రభుత్వాలు మొత్తం తగ్గించడానికి కుట్ర చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు తామా ముత్యాలమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు రాజమండ్రి దానియేలు, ఎం.సుధారాణి, యు.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ కె వెట్రిసెల్వి

చింతలపూడి: ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. చింతలపూడి మండలంలో బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మార్గమధ్యంలో ప్రగడవరం పంచాయతీ వెలగలపల్లి గ్రామంలో ఆగి తాగునీటి పథకాన్ని పరిశీలించారు. డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ ఉండటం, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎప్పుడు శుభ్రం చేశారో వివరాలు లేకపోవడం, తాగునీటి పరీక్షలు నిర్వహించకపోవడంపై కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, డ్రెయిన్లు చేయాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డీఎల్‌పీఓ సుందరి, కార్యదర్శి మురళీకృష్ణ, సర్పంచ్ టి.భూపతి తదితరులు ఉన్నారు.


వెలగలపల్లిలో తాగునీటి పథకాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

- జేసీబీ నిలుపుదల.. ఆపరేటర్ స్టేషన్‌కు తరలింపు
- కేసు లేకుండా చేసేందుకు టీడీపీ నేతల విశ్వప్రయత్నాలు

ద్వారకాతిరుమల: పోలవరం కుడి కాలువ గట్టుపై టీడీపీ నేతల అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని గుళ్లపాడు వద్ద బుధవారం సాయంత్రం ఈ తవ్వకాలను పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై కేసు నమోదు కాకుండా చేసేందుకు సదరు నేతలు పైరవీలు సాగిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని గుళ్లపాడు వద్ద పోలవరం కుడి కాలువ గట్టును గత కొద్దిరోజులుగా లైన్ గోపాలపురంనకు చెందిన కొందరు టీడీపీ నేతలు అక్రమంగా తవ్వి, మట్టిని వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. మట్టి కావాల్సిన వారు తవ్వకాలు జరిగే ప్రాంతానికి వెళితే చాలు.. ట్రాక్టరుకు ఇంత, టిప్పర్‌కు ఇంతని తీసుకుని లోడింగ్ చేస్తున్నారు. అలా వచ్చిన సొమ్ముతో సదరు నేతలు వారి జేబులు నింపుకుంటున్నారు. పైసా ఖర్చు లేకుండా నిత్యం లక్షలాది రూపాయలు సొమ్మును స్వాహా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. దీని ఫలితంగా తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలు అగాథాలను తలపిస్తున్నాయి. గుళ్లపాడు వద్ద జరుగుతున్న తవ్వకాలను పోలీసులు అడ్డుకునేందుకు వెళ్లగా ట్రాక్టర్ డ్రైవర్లు తమ వాహనాలతో అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో పోలీసులు జేసీబీని నిలుపుదల చేసి, ఆపరేటర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే జేసీబీ భీమడోలుకు చెందిన టీడీపీ నాయకుడిది కావడంతో కేసు నమోదు కాకుండా చేసేందుకు సదరు నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.


గుళ్లపాడు వద్ద పోలీసులు నిలుపుదల చేసిన జేసీబీ

ధాన్యం సొమ్ములు చెల్లించాలని కోరుతూ ఆందోళన


గవరవరం గోడౌన్ వద్ద రైతులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొయ్యలగూడెం: దళారుల చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ గవరవరం గోడౌన్ వద్ద పోలవరం మండలానికి చెందిన రైతులు బుధవారం రెండో రోజు ఆందోళన సాగించారు. ఈ ఆందోళనకు సీపీఎం, ఏపీ రైతు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో దళారులు రైతుల వద్ద నుంచి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా దాదాపు రూ.3.5 కోట్లు చెల్లించకుండా మోసం చేయడం దారుణమని విమర్శించారు. బాధిత రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ రైతుల న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

జంగారెడ్డిగూడెం: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. బుధవారం గవర్నమెంట్ టింబర్ డిపో వద్ద నిర్వహించిన హమాలీల యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని, డివిజన్‌లో ఉన్న కార్మిక నాయకులందరూ హాజరుకావాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులుగా ఉన్న హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర పనులు చేసేవారు, ఉద్యోగస్తులకు ఉన్న హక్కులను ఈ శిక్షణ తరగతుల్లో వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, పశ్చిమగోదావరి జిల్లా ఇఫ్టు నాయకులు తదితరులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి బుజ్జియ్య, ఎడ్లపల్లి సుబ్బారావు, పి నాగేష్, మనేల్లి మహిమారావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు

పాఠ్యపుస్తకాల అందజేత


జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సొంగా రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలంటే నేర్చుకోవాలనే తపనతోపాటు ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక దామోదరం సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ప్రభాకరరావు, శ్యాం చంద్రశేఖ, కావిడి కృష్ణ, తూతుకుంట రాము, ఆరేపల్లి రామారావు, అబ్బిన దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. దాతల సహకారంతో ఆసుపత్రికి దుప్పట్లు అందజేశారు. ఇసుకను త్వరలో అందుబాటులోకి తేవాలని భవన నిర్మాణ కార్మిక నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందచేశారు. అలాగే నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టులకు తమకు ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ నేతలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

చిట్టిరాజు ఘనత దళితులకు గర్వకారణం

కొయ్యలగూడెం: అంబేడ్కర్ కలలుగన్న దిశలో దళితులు సాధికారిత సాధిస్తున్నారని అని ఎంపీటీసీ బిరుదుగట్ల రత్నకుమారి పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కుమారుడు చిట్టిరాజు ఐపీఎస్‌కి ఎంపికైన సందర్భంగా గవరవరం గ్రామంలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ సేవా సమితి, అంబేడ్కర్ సేవా సంఘ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 2023 సివిల్స్ ఫలితాల్లో 833వ ర్యాంకు సాధించి దళితులకు చిట్టిరాజు గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం కేక్ కట్ చేసి స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. బిరుదుగడ్డ ప్రేమ్ కుమార్, కరుటూరి కిషోర్‌కుమార్, కరుటూరి సూరి, కోణాల వెంకట్రావు, దండే రామారావు, దండే బద్రి, జుమాల రమణ, బిరుదుగడ్ల రాజు, కోసూరి అఖిల్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మెగా జాబ్‌మేళా

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు తెలిపారు. కళాశాల చరిత్ర అధ్యాపకులు, ప్లేస్మెంట్ ఆఫీసర్ బి.అశోక్ ఆధ్వర్యంలో వివిధ కంపెనీ ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. 500 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేయించుకున్నారని చెప్పారు. జి.ప్రవీణ్ కృష్ణ, ఏలూరు జిల్లా సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ కెనడి, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలక్ష్యం ప్రదర్శించవద్దు

వేలేరుపాడు: పింఛన్ల పంపిణీలో అలక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదని జెడ్పీ సీఈఓ సుబ్బారావు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించి సాయంత్రంలోగా 99 శాతం పూర్తి చేయాలన్నారు. వరద సమయంలో సచివాలయ సిబ్బంది సెలవులపై వెళ్లరాదని అన్నారు. కార్యక్రమంలో వేలేరుపాడు తహసీల్దార్ చెన్నారావు, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా లయన్స్ క్లబ్ సేవలు

చింతలపూడి: ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు విస్తృతంగా జరుగుతున్నాయని జిల్లా లయన్స్‌క్లబ్ గవర్నర్ పీఎంజేఎఫ్ కాకరాల వేణుబాబు అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేణుబాబు చింతలపూడి జోన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్‌క్లబ్‌లో జరిగిన జోన్ క్లబ్‌ల సమావేశంలో చింతలపూడికి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ లిఖిత అనే విద్యార్థినికి రూ.5 వేలు, బీటెక్‌లో సీటు సంపాదించుకున్న మౌనిక అనే విద్యార్థినికి రూ.5 వేలు, ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాత్రికేయుడు అశోక్ కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు. అదేవిధంగా గోలి నితిన్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కండుకూరులోని జెడ్పీ హైస్కూల్‌కు రూ.12 వేలు విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, చింతలపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన పీహెచ్‌సీకి 15 కుర్చీలు అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు చిల్లపల్లి విజయలక్ష్మి, కార్యదర్శి, చింతనిప్పుల మాధవి, డీసీఎస్ శ్రీహరి, అడిషినల్ డీసీఎస్ విష్ణుకుమార్, జోన్ చైర్మన్ కృష్ణవేణి, జీఎస్టీ కోఆర్డినేటర్ చిల్లపల్లి మోహన్‌రావు, ఎ.పవన్‌కుమార్, చందూరి అబ్బయ్య, ఎస్ఎస్ఎన్ గాంధి, చిక్కాల సుధాకర్, ఎస్‌డీ ఖాజా మొయినుద్దీన్, జల్లిపల్లి శివాజి, రాజేష్ నాయుడు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని లిఖితకు రూ.5 వేలు అందిస్తున్న దృశ్యం

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆషాడ బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులకు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవానికి జంగారెడ్డిగూడెంకు చెందిన చలమచర్ల సత్యనారాయణ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వరద బాధితుల సరుకుల అక్రమ రవాణా

వేలేరుపాడు: గోదావరి వరద బాధితులకు పంపిణీ చేయాల్సిన నిత్యావసర వస్తువులను బయటి ప్రాంతానికి వ్యాన్‌లో తరలిస్తుండగా బుధవారం సాయంత్రం జనసేనకు చెందిన నేతలు వెంబడించి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వేలేరుపాడు గిరిజన ఆశ్రమ పాఠశాల స్టాక్‌పాయింట్ నుంచి ఒక వ్యాన్‌లో 40 క్వింటాళ్ళ ఉల్లిపాయలు, 31 క్వింటాళ్ల బంగాళదుంపలు లోడ్ చేసుకున్నారు. ఇది గుర్తించిన జనసేన మండల నేతలు మేడేపల్లి వద్ద వ్యాన్‌ను అడ్డుకున్నారు. డ్రైవర్‌ను నిలదీయగా, చింతలపూడికి సరుకులు తీసుకెళ్తున్నామని చెప్పాడు. అయితే వ్యాన్‌ను అనుసరిస్తూ వస్తున్న ఇద్దరు రేషన్ డీలర్లు, సివిల్‌సప్లెస్ డీటీ మాత్రం మేడేపల్లి, కమ్మరిగూడెం వరద బాధితులకు పంపిణీ చేసేందుకు సరుకులు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి జనసేన నేతలు అందించారు. దీంతో వ్యాన్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

క్లుప్తంగా

ఆషాఢం సారె వైభవం


ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం వద్ద నుంచి వాసవీమాతకు సారెను తీసుకెళ్తున్న ఆర్యవైశ్యులు

ద్వారకాతిరుమల: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి, క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారికి మహిళా భక్తులు బుధవారం ఆషాఢం సారె సమర్పించారు. గ్రామంలోని ఆర్యవైశ్య మహిళలు శ్రీవారి పాదుకా మండపం వద్ద నుంచి స్వీట్లు, పూలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమలు, పట్టు వస్త్రాలతో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయంలో పలు రకాల కూరగాయలు, ఆకుకూరల అలంకారంలో శాఖాంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారికి సారెను సమర్పించి, పూజాధికాలు నిర్వహించారు. కుంకుళ్లమ్మ అమ్మవారికి పోతునూరు శ్రీనివాస సేవా సమితి, మొగల్తూరు శ్రీ బండి ముత్యాలమ్మ తల్లి సేవా సమితికి చెందిన సుమారు 60 మంది మహిళలు స్వీట్లు, గాజులు, పూలు, పండ్లు, చీర, పసుపు, కుంకుమలను సారెగా అందించారు.

త్రిశక్తి పీఠంలో...

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలోని త్రిశక్తి పీఠంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న మహాదుర్గ, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లకు బుధవారం గ్రామానికి చెందిన మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. అమ్మవార్లకు వివిధ రకాలైన స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమతోపాటు నూతన వస్త్రాలను అమ్మవార్లకు సారెగా సమర్పించారు.

మహిళా పోలీస్‌కు అవార్డు


మహిళా పోలీస్ లక్ష్మీ సుజనకు శ్రీ గురు పురస్కారం అవార్డును అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: కడప జిల్లా గండి శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రంలోని శ్రీ వాసవి అన్నదాన సత్రంలో జులై 29న రాష్ట్ర స్థాయి అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం 2024 శ్రీ గురు పురస్కారాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల సచివాలయం–2 మహిళా పోలీస్ పి.లక్ష్మీ సుజనను చండీ దళ నాయకి (మహిళా శక్తి) అవార్డుతో సత్కరించారు.

బీపీ మెషీన్ బహూకరణ

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రక్తపోటు పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం సోషల్ వర్కర్ ఆరేటి ఏసుబాబు ద్వారా తెలుసుకున్న గ్రామానికి చెందిన రైతు బాలం నాగరాజు రూ:2500 విలువ గల బీపీ మెషీన్‌ను ఖరీదు చేసి పీహెచ్‌సీలోని వైద్య, ఆరోగ్య సిబ్బందికి అందజేశారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్

జంగారెడ్డిగూడెం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14వ తేదీ జంగారెడ్డిగూడెం కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఈజీ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదా కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చున్నారు.

వాటర్ ఫిల్టర్ అందజేత

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయానికి కొయ్యలగూడెం మండలం పొంగుటూరు గ్రామానికి చెందిన న్యాయవాది సొలస రవి ధర్మరాజు వాటర్‌ఫిల్టర్ బహూకరించారు. దాతను ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు.

ఓఎస్ దుర్గాప్రసాద్‌కు సత్కారం

కొయ్యలగూడెం: పంచాయతీరాజ్ శాఖలో ఆఫీస్ సబార్డినేట్ (ఓఎస్)గా సేవలు అందించిన బలగంశెట్టి దుర్గాప్రసాద్ తమ డిపార్ట్‌మెంట్ కి గర్వకారణంగా నిలిచారని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. దుర్గాప్రసాద్ ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం రేపల్లెవాడ ఫంక్షన్ హాల్లో బుధవారం డీఈ నీలం సీతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు దుర్గాప్రసాద్, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

ద్వారకాతిరుమల: మారంపల్లి పంచాయతీ లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై బుధవారం ఒక కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ముగ్గురు వ్యక్తులు ఒక కారులో విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన ఒక క్యాబేజీ లోడు లారీ వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు.